క్లుప్తంగా

269 మందికి వైద్యసేవలు



చినకొండేపూడిలో వైద్యం అందిస్తున్న డాక్టర్ రాజు

సీతానగరం: చినకొండేపూడి సచివాలయం-1 పరిధిలో శనివారం ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమంలో నిర్వహించారు. ఈ సందర్భంగా 269 మందికి పీహెచ్‌సీ డాక్టర్ ఎస్ రాజు వైద్య సేవలు అందించారు. అంగన్‌వాడీ సెంటర్లకు వెళ్లి పిల్లలకు వైద్య పరీక్షలు చేశారు. మంచంపై ఉన్న రోగుల ఇళ్లకు వెళ్లి చికిత్స అందించారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ స్పందన, ఏఎన్‌ఎంలు వైశాలి, సంధ్య, ఆశా వర్కర్లు రాణి, కుమారి పాల్గొన్నారు.

మగ్గం వర్క్ శిక్షణ ప్రారంభం



శిక్షణకు హాజరైన మహిళలు

రాజానగరం: మగ్గం వర్క్‌కి మంచి డిమాండ్ ఉందని, దీని ద్వారా ఆదాయం పొందుతూ ఆర్థికాభివృద్ధి సాధించవచ్చునని డాక్టర్ వినయ్ సుంకర ఫౌండేషన్ వ్యవస్థాపకుడు సుంకర వెంకటేశ్వరరావు అన్నారు. ఫౌండేషన్ ద్వారా మగ్గం వర్కు శిక్షణ తరగతులు శనివారం నందరాడలో ప్రారంభమయ్యాయి. ఈ శిక్షణకు తొలిరోజు 60 మంది మహిళలు హాజరయ్యారు. వీరందరికీ అవసరమైన మెటీరియల్‌ని అందజేసి, శిక్షణను ప్రారంభించారు. కార్యక్రమంలో ట్రస్టు ఎండీ సుంకర ప్రదీప్, సభ్యులు దుర్గ, నాగమణి, కిరణ్ సౌమ్య, మీనా, శిక్షకురాలు జంగిలి కుమారి పాల్గొన్నారు.

మండల కేంద్రానికి చేరుకున్న పాఠ్యపుస్తకాలు



రంగంపేట హైస్కూల్లో భద్రపరిచిన పాఠ్య పుస్తకాలు

రంగంపేట: మండలంలోని ప్రభుత్వ పాఠశాలలకు 2024-25 విద్యా సంవత్సరానికి ప్రభుత్వం నుంచి పాఠ్య పుస్తకాలు చేరుకున్నట్టు మండల విద్యాశాఖాధికారులు కె.శ్రీనివాసరావు, పి. మధుసూదనరావు తెలిపారు. శనివారం వారు మాట్లాడుతూ మండలానికి మొదటి విడతగా 2,501 బెల్టులు, 27,246 పాఠ్యపుస్తకాలు వచ్చాయని వాటిలో ఒకటి నుంచి ఐదో తరగతి వరకూ 5,149, ఆరో తరగతి నుంచి పదో తరగతి వరకూ 22,097 పాఠ్య పుస్తకాలు ఉన్నారయన్నారు. పాఠ్యపుస్తకాలను రంగంపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల స్టాక్ రూంలో ఉంచామన్నారు.

పొగతో వాహన చోదకుల అవస్థలు



రఘుదేవపురం శివారున రోడ్డుపై వ్యాపించిన పొగ

సీతానగరం: రాజమహేంద్రవరం - సీతానగరం రోడ్డుకు ఆనుకుని వేసిన చెత్తకు నిప్పు పెట్టడంతో వాహనదారులు పలు ఇబ్బందులు పడుతున్నారు. గ్రామ పంచాయతీల అధికారులు చెత్తను డంపింగ్ యార్డ్‌కు తరలించకుండా ప్రధాన రోడ్డు పక్కనే వేయిస్తున్నారు. అనంతరం పంచాయతీ సిబ్బంది చెత్తకు నిప్పు పెట్టడంతో తీవ్రమైన పొగ వ్యాపించి వాహన చోదకులు, ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. రఘుదేవపురం శివారున చెత్తకు నిప్పు పెట్టడంతో పొగ విపరీతంగా వ్యాపించింది. రోడ్డులో ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

గాలులకు నేలరాలిన మామిడి కాయలు



గుమ్ములూరులో రాలిపోయిన మామిడి కాయలు

మధురపూడి: వాతావరణంలో వచ్చిన మార్పుల కారణంగా శనివారం వీచిన ఈదురు గాలులకు మామిడికాయలు నేలరాలిపోయిాయి. గుమ్ములూరు, మధురపూడి, కోటికేశవరం, నర్సాపురం, గాదరాడ, కణుపూరు తదితర గ్రామాల్లో మామిడి కాయలు రాలిపోయాయి. దీంతో రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. అసలే దిగుబడి తక్కువగా ఉందని, ఈ సమయంలో వీచిన గాలులకు చెట్లకున్న కాయలు కూడా నేలరాలిపోయాయన్నారు. కోరుకొండ మండలంలో 1,646.46 హెక్టార్ల విస్తీర్ణంలో మామిడి తోటలున్నాయి.

నకిలీ విత్తనాలతో జాగ్రత్త

- ఖరీఫ్ పనులకు సమాయత్తమవుతున్న రైతులు
- విత్తనాల కొనుగోలులో జాగ్రత్తలు పాటించాలంటున్న వ్యవసాయాధికారులు



రంగంపేటలో ఖరీఫ్ పనులు ప్రారంభించిన రైతు

రంగంపేట: రుతుపవనాలు వచ్చే సమయం ఆసన్నమైంది. ప్రస్తుతం వర్షాలు పడుతుండటంతో రైతులు ఖరీఫ్ కోసం పొలాలకు ఎరువులు తోలడం, దుక్కులు దున్నడం ప్రారంభించారు. వాతావరణం పూర్తిస్థాయిలో అనుకూలిస్తే నెల రోజుల్లో రైతులు విత్తనాలు జల్లే పనులు చేపట్టనున్నారు. అనపర్తి, రాజానగరం రెండు నియోజకవర్గాల్లోనూ ఖరీఫ్ సీజన్‌లో ప్రధానంగా వరి పంటే ఎక్కువగా సాగు చేస్తుంటారు. వర్షాలు సమృద్ధిగా కురిస్తే ఈ ఏడాది వరి పంట విస్తీర్ణం పెరిగే అవకాశాలున్నాయని వ్యవసాయశాఖాధికారులు చెబుతున్నారు. వ్యవసాయ శాఖ ద్వారా అందించే రాయితీ విత్తనాలే కాకుండా రైతులు ప్రైవేటు దుకాణాల్లో లభించే విత్తనాలపై ఆధారపడుతున్నారు. ఈ క్రమంలోనే కొందరు వ్యాపారులు తక్కువ ధరలో ఎక్కువ దిగుబడి ఇచ్చే విత్తనాలు తమ వద్ద లభిస్తాయంటూ రైతులను మభ్యపెడుతున్నారు. నకిలీ విత్తనాల బారిన పడి ఏటా అధిక సంఖ్యలో రైతులు నష్టపోతున్న నేపథ్యంలో కొనుగోలు సమయంలో తగిన సూచనలు పాటించాలని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు. తగిన జాగ్రత్తలు తీసుకుంటే నకిలీ విత్తనాలను ముందే గుర్తించొచ్చని, నష్టపోయినా పరిహారం సైతం పొందచ్చని చెబుతున్నారు.

రైతులు తీసుకోవలసిన జాగ్రత్తలు

- వ్యవసాయ శాఖ అనుమతి పొందిన దుకాణాల్లో మాత్రమే రైతులు విత్తనాలు కొనుగోలు చేయాలి. కొన్ని చోట్ల ప్రభుత్వం అనుమతి లేని అనధికార విత్తన వ్యాపారులు తెల్లసంచుల్లో నకిలీ విత్తనాలను విక్రయించే అవకాశం ఉన్నందున వారి సమాచారాన్ని తక్షణమే అధికారులకు తెలియజేయాలి.
- ప్రభుత్వంతో ఒప్పందం కుదుర్చుకున్న సంస్థల నుంచే సర్టిఫైడ్ విత్తనాలు కొనుగోలు చేయాలి. కొనుగోలు చేసిన విత్తనాలకు సంబంధించి బిల్లు తప్పనిసరిగా తీసుకోవాలి. బిల్లుపై రైతు చిరునామా, గడువు తేదీ, విత్తనం ధర, కంపెనీ పేరు, అమ్మినవారి సంతకం తప్పనిసరిగా ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలి.
- విత్తన బస్తాపై ముద్రించిన ధ్రువపత్ర బిల్లు తమ పంట చేతికి వచ్చే వరకూ రైతులు భద్రపరచుకోవాలి. విత్తనాలు కొన్న వెంటనే మొలక శాతం పరీక్షించుకోవాలి. కనీసం 75 శాతం మొలకలు ఉంటేనే వాటిని విత్తనంగా వినియోగించుకోవాలి. విత్తన సంచులను రైతులు నమూనా వివరాల కోసం పంటకోతకు వచ్చే వరకూ దాచుకోవాలి.

పరిహారం పొందడం సులువే



విత్తనాల ఎంపికలో రైతులు జాగ్రత్తలు పాటించాలి. ప్రభుత్వం నుంచి అనుమతి పొందిన వ్యాపారుల వద్దే విత్తనాలు కొనుగోలు చేయాలి. ఒకవేళ నకిలీ విత్తనాలతో మోసపోతే వెంటనే వ్యవసాయాధికారులకు, పోలీసులకు ఫిర్యాదు చేయవచ్చు. విత్తనాలు నాణ్యమైనవి కాకపోవడం వల్లే దిగుబడి రాలేదని గుర్తిస్తే సదరు విత్తన కంపెనీపై మండల వ్యవసాయాధికారి ద్వారా జిల్లా వ్యవసాయ సంచాలకులకు ఫిర్యాదు చేసి పరిహారం పొందొచ్చు. దీనికోసం రైతులు తమ విత్తన కొనుగోలు బిల్లు భద్రపరచుకోవాల్సి ఉంటుంది.

– కె.శ్రీనివాసరావు, వ్యవసాయాధికారి, రంగంపేట మండలం

వైభవంగా శ్రీపుష్పయాగం



ప్రత్యేక అలంకరణలో స్వామివారు



ప్రత్యేక అలంకరణలో వేంకటేశ్వరస్వామి

పెదపూడి: సంపర గ్రామంలోని అలివేలుమంగా సమేత వేంకటేశ్వరస్వామికి శనివారం పుష్పయాగం వైభవంగా నిర్వహించారు. కల్యాణోత్సవాల్లో భాగంగా ఈ నెల 19న స్వామివారి కల్యాణం నిర్వహించారు. దానిలో భాగంగా పుష్పోత్సవం జరిపారు. స్వామి వారికి ఆలయ అర్చకుడు ఖండవిల్లి హనుమంతాచార్యులు పంచామృతాభిషేకాలు, తులసి పూజలు చేశారు. అమ్మవారికి కుంకుమ పూజలు జరిపారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

ఘనంగా పుష్పయాగం

బిక్కవోలు: మండలంలోని బిక్కవోలు పార్కు వీధిలో కొలువైన శ్రీదేవీ భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో అర్చకులు మంగినీడి కుమార సుబ్రహ్మణ్యశర్మ ఆధ్వర్యంలో శనివారం ఘనంగా పుష్పయాగం నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారిని పూలతో ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చి స్వామి వారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

ఓట్ల లెక్కింపునకు సర్వం సిద్ధం

- 16 రౌండ్లలో ఫలితాల వెల్లడి
- ఆర్వో చైత్రవర్షిణి



చైత్రవర్షిణి, ఆర్వో

రాజానగరం: ఎన్నికల కౌంటింగ్ జూన్ 4న జరగనున్న నేపథ్యంలో ఆదికవి నన్నయ యూనివర్సిటీలో అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నామని నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి ఎ.చైత్రవర్షిణి తెలిపారు. ఆమె శనివారం విలేకరులతో మాట్లాడుతూ రాజానగరం నియోజకవర్గ పరిధిలోని సీతానగరం, కోరుకొండ, రాజానగరం మండలాలలో 2,16,491 మంది ఓటర్లు ఉన్నారని, ఈనెల 13న జరిగి పోలింగ్‌లో 216 కేంద్రాల ద్వారా 1,89,508 మంది ఓటు చేశారన్నారు. ఈవీఎం యూనిట్లను నన్నయ యూనివర్సిటీ ప్రాంగణంలోని స్ట్రాంగ్ రూమ్‌లలో సాయుధ బలగాల పహారాతో భద్రంగా ఉన్నాయని తెలిపారు. జూన్ 4న జరిగే కౌంటింగ్‌ను 16 రౌండ్లలో పూర్తి చేసేలా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఈవీఎంలలో పోలైన ఓట్లు లెక్కింపునకు 14 టేబుళ్లు, పోస్టల్ బ్యాలెట్ల లెక్కింపునకు నాలుగు టేబుళ్లు, ట్యాబ్‌లేషన్ టేబుళ్లు రెండు ఉంటాయని, 15 రౌండ్లు పూర్తయిన తరువాత 16వ రౌండు ఐదారు టేబుళ్లపై జరగడంతో లెక్కింపు పూర్తయి, ఫలితాన్ని అధికారికంగా ప్రకటిస్తారన్నారు. పోటీలో ఉన్న అభ్యర్థుల తరపున ఒక్కో టేబుల్‌కి ఒక ఏజెంట్‌ను మాత్రమే అనుమతిస్తారని, ఏజెంట్‌గా వెళ్లదలచిన వారు జూన్ ఒకటిలోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. లెక్కింపు జరిగే ప్రాంతానికి, ఏజెంట్లకు మధ్య ఇనుప తీగలతో కూడిన చట్రం అడ్డుగా ఉంటుందన్నారు. అలాగే లెక్కింపు కేంద్రంలోకి సెల్‌ఫోన్లను అనుమతించరన్నారు. లెక్కింపు కేంద్రానికి ఒక కిలోమీటర వరకూ 144 సెక్షన్‌తో పాటు నిషేధాజ్ఞలు అమలులో ఉంటాయన్నారు. కౌంటింగ్ జరిగే ప్రాంతానికి నిర్ణీత పరిధిలో బాణసంచా కాల్పులు, విక్రయాలు నిషిద్ధమన్నారు. ఎన్నికల నియమావళిని ఎవరు ఉల్లంఘించినా చర్యలు తప్పవని ఆర్వో హెచ్చరించారు.

రోడ్డు ప్రమాద బాధితులకు కలెక్టర్ సాయం



ఘటనా స్థలంలో వివరాలు తెలుసుకుంటున్న కలెక్టర్ మాధవీలత

మధురపూడి: రోడ్డు ప్రమాదంలో గాయపడిన క్షతగాత్రులకు సాయం అందించి కలెక్టర్ మానవత్వం చాటుకున్నారు. విధి నిర్వహణలో భాగంగా కలెక్టర్ మాధవీలత శనివారం మధురపూడి వచ్చారు. అనంతరం రాజమహేంద్రవరానికి తిరిగి వెళుతుండగా కోరుకొండ మండలం గాడాల వద్ద రోడ్డు పక్కన క్షతగాత్రులను చూశారు. వెంటనే కారును ఆపించి, కిందకు దిగి బాధితుల వద్దకు వెళ్లి మాట్లాడారు. వెంటనే 108కు ఫోన్ చేసి వారిని రాజమహేంద్రవరం ప్రభుత్వం ఆస్పత్రికి పంపించారు. హాస్పిటల్ సూపరింటెండెంట్‌తో మాట్లాడి క్షతగాత్రులకు మెరుగైన వైద్యసేవలు అందాలని సూచించారు. కలెక్టర్ స్పందించిన తీరుపై పలువురు అభినందనలు తెలిపారు.

16 మంది గైర్హాజరు

రంగంపేట: మండల కేంద్రమైన రంగంపేటలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం నిర్వహించిన ఇంటర్ సప్లిమెంటరీ ఇంగ్లిష్ పరీక్షకు 16 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని కళాశాల చీఫ్ సూపరింటెండెంట్ బి.హేమ తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉదయం జరిగిన మొదటి సంవత్సరం ఇంగ్లిష్ పేపర్-1 పరీక్షకు 243 మంది విద్యార్థులకు గాను 231 మంది, మధ్యాహ్నం జరిగిన రెండో సంవత్సర ఇంగ్లిష్ పేపర్-2 పరీక్షకు 20 మంది విద్యార్థులకు గాను 16 మంది హాజరయ్యారన్నారు.

కడియం హైస్కూల్ ఆయాలకు ద్వితీయ స్థానం



ద్వితీయ స్థానంలో నిలిచిన కడియం హైస్కూల్ మిడ్డే మీల్స్ బృందం

కడియం: పాఠశాలల్లో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం వండుతున్న ఆయాలకు మే 21 నుంచి 24 వరకూ గన్నవరంలో శిక్షణ తరగతులు నిర్వహించారు. పీఎం పోషణ స్కీం, రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. శిక్షణ అనంతరం పాఠశాలల్లో వారు తయారు చేసే వంటలపై పోటీలు నిర్వహించారు. కడియం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఎస్.అన్నపూర్ణ, ఈ.శాంతకుమారి శనివారం తయారు చేసే చక్కెర పొంగలి, పప్పు చారు, గ్రీన్ రైస్ అంశంలో ద్వితీయ స్థానం సాధించారు. వీరికి పీఎం పోషణ స్కీం నిర్వాహకులు కుక్కర్ బహుమతిగా అందించారు. కార్యక్రమంలో జిల్లా ఏడీ వి.వెంకటరాజు, రాష్ట్ర స్థాయి అధికారులు పాల్గొన్నారు. కాగా.. వంటల పోటీలో ద్వితీయ స్థానం సాధించిన అన్నపూర్ణ, శాంతకుమారిలను జిల్లా విద్యాశాఖాధికారి కె.వాసుదేవరావు, ఉప విద్యాశాఖాధికారి ఈ.లక్ష్మీనారాయణ, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు టి.సత్యనారాయణ, ఎంఈఓలు నాగేశ్వరరావు, ఫణికుమార్, స్టాఫ్ కార్యదర్శి జి.సత్యనారాయణ అభినందించారు.

సాంకేతిక విధానాలను అనుసరించాలి



విద్యార్థుల నమూనాలను తిలకిస్తున్న వ్యవసాయ శాస్త్రవేత్తలు, అధికారులు, రైతులు

గోకవరం: మారుతున్న వ్యవసాయ పరిస్థితులకు అనుగుణంగా ఉద్యాన రైతులు సరికొత్త సాంకేతిక విధానాలను అనుసరించాలని రంపచోడవరం ఉద్యాన పరిశోధన సంస్థ వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ కె.రాజేంద్రప్రసాద్ సూచించారు. వీరలంకపల్లి గ్రామంలో రామకృష్ణా గార్డెన్స్‌లో శనివారం రైతులకు గ్రామీణ ఉద్యాన కృషీ అనుభవ కార్యక్రమం నిర్వహించారు. దీనిని కోరుకొండ ఏడీఏ బీకే మల్లికార్జునరావు ప్రారంభించగా ముఖ్య అతిథిగా పాల్గొన్న శాస్త్రవేత్త రాజేంద్రప్రసాద్, సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ పీసీ వెంగయ్య రైతులను, ఉద్యాన విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. మామిడి, జీడిమామిడిలో వచ్చే వివిధ రకాల తెగుళ్లు, చీడపీడలు, వాటి నివారణ చర్యల గురించి అవగాహన కల్పించారు. విద్యార్థులు తయారు చేసిన వినూత్న వ్యవసాయ సాంకేతికతల నమూనాలను సందర్శించి అభినందించారు.

మహనీయుల పోరాటం.. నిత్యస్మరణీయం



కాపవరం ఎంపీడీవో కార్యాలయంలో స్వాతంత్ర్య సమరయోధుల చిత్రపటాలు

మధురపూడి: దేశంలోని ప్రజలందరూ ఈరోజు అనుభవిస్తున్న స్వేచ్ఛా జీవితమంతా స్వాతంత్ర్య సమర యోధుల త్యాగఫలమే. వారు చేసిన పోరాటం, పడిన కష్టాలు, చేసిన త్యాగం నిత్య స్మరణీయం. ఆనాటి స్వాతంత్ర్య సమర యోధుల ఫొటోలను కోరుకొండ మండలం కాపవరంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఏర్పాటు చేశారు. ఆ మహనీయులందరి ఫొటోలు ఒకే చోట చూడగానే నాడు వారు చేసిన పోరాటం మదిలో మెదులుతుంది. వారి పోరాట పటిమను గుర్తుకుతెస్తుంది. మహాత్మాగాంధీ, సుభాష్ చంద్రబోస్, అల్లూరి సీతారామరాజు, భగత్ సింగ్ తదితర సుమారు 23 మంది మహనీయుల చిత్రపటాలను ఇక్కడ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కోరుకొండ ఎంపీడీవో హేమసుందరరావు మాట్లాడుతూ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మహనీయుల ఫొటోలు అందరికీ స్ఫూర్తిదాయకమన్నారు. భవిష్యత్తు తరాలకు ఆదర్శనీయమన్నారు.

పిల్లల విషయంలో అప్రమత్తత అవసరం



సదస్సులో మాట్లాడుతున్న న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ప్రకాష్ బాబు

కంబాలచెరువు: మానవ అక్రమ రవాణా, తప్పిపోయిన, ఆచూకీ తెలియని పిల్లల కేసులపై సంబంధిత అధికారులతో శనివారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ప్రకాష్ బాబు మాట్లాడుతూ మానవ అక్రమ రవాణాకు గల ముఖ్య కారణాలను వివరించారు. కుటుంబ సభ్యులతో తగినంత సమయం గడపకపోవడం, అదే సమయంలో వివిధ సామాజిక మాధ్యమాలలో అపరిచితులతో పెరిగిన స్నేహాలతో చాలా మంది అక్రమ రవాణాకు గురవుతున్నారన్నారు. కుటుంబ సభ్యుల మధ్య ఆరోగ్యకరమైన వాతావరణం ఉంటే ఇలాంటి నేరాలు తగ్గుతాయన్నారు. పిల్లల విషయంలో తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలన్నారు. తప్పిపోయిన పిల్లల ఆచూకీ అంత సులభంగా లభించదని, ఆ పిల్లల పరిస్థితి కూడా ఆందోళనకరంగా మారుతుందన్నారు. అలాంటి వారికి కాపాడేందుకు తీసుకోవాల్సిన చర్యలు, న్యాయసేవలపై వివిధ ప్రభుత్వ శాఖలు అవగాహన కలిగి ఉండాలన్నారు. నల్సావారి అక్రమ రవాణా బాధితులు, వాణిజ్య పరమైన లైంగిక దోపిడీ బాధితుల పథకం 2015 ద్వారా అందిస్తున్న సేవలను వివరించారు. మానవ అక్రమ రవాణా, తప్పిపోయిన, ఆచూకీ తెలియని పిల్లలకు సంబంధించిన కేసులలో ఉచిత న్యాయ సహాయం కోసం జిల్లా న్యాయ సేవాధికార సంస్థను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ చైల్డ్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టు అధికారి కె.విజయ కుమారి, డీఈవో కె.వాసుదేవరావు, డీసీఆర్‌బీ సబ్ ఇన్‌స్పెక్టర్ డి.వాణి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

మెడికల్ కళాశాలలో క్యాన్సర్ శిక్షణ ప్రారంభం



క్యాన్సర్ స్క్రీనింగ్ శిక్షణకు తరలివచ్చిన వైద్య సిబ్బంది

కంబాలచెరువు: రాజమహేంద్రవరం ప్రభుత్వ మెడికల్ కళాశాలలో శనివారం క్యాన్సర్ స్క్రీనింగ్‌పై మూడు రోజుల పాటు జరిగే శిక్షణ ప్రారంభమైంది. మెడికల్ కాలేజీలోని ప్రివెంటివ్ అంకాలజీ యూనిట్‌ను ట్రైనర్ ఆఫ్ ట్రైనర్స్‌గా గుర్తించి జిల్లాలోని వైద్యుల బృందానికి ఈ శిక్షణ అందిస్తున్నారు. జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారి (డీఎంహెచ్‌వో) డాక్టర్ కె.వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో మెడికల్ కాలేజీ సూపరింటెండెంట్ పర్యవేక్షణలో ఈ కార్యక్రమం జరుగుతోంది. ఎపిడిమాలజిస్ట్ సుధీర్ బాబు, ప్రోగ్రామ్ ఆఫీసర్లు డాక్టర్ హరిచంద్ర ప్రసాద్, డాక్టర్ ప్రశాంత్, నోడల్ ఆఫీసర్ కమ్యూనిటీ మెడిసిన్, అంకాలజిస్టులు డాక్టర్ స్పందన, డాక్టర్ సమ్మె రాజా, డాక్టర్ రామరాజు, పాథాలజిస్ట్ డాక్టర్ శ్రీవల్లి తదితరులు వైద్యాధికారులకు శిక్షణ ఇచ్చారు. వారు మాట్లాడుతూ క్యాన్సర్‌ను ముందుగా గుర్తించడం వల్ల దాని స్థాయి పెరగకుండా వైద్యం అందించి, వ్యాధిని నివారించవచ్చన్నారు. శిక్షణలో తెలిపిన విషయాలను శ్రద్ధతో నేర్చుకొని ప్రజలందరికీ మంచి సేవలు అందించాలన్నారు. శిక్షణ పొందిన వైద్య బృందం కిందిస్థాయిలోని కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్, ఏఎన్‌ఎంలకు ట్రైనింగ్ ఇస్తారన్నారు. శిక్షణ అనంతరం యూనివర్సల్ స్క్రీనింగ్ మూడో దశ సర్వేను మొదలుపెట్టి క్యాన్సర్ స్క్రీనింగ్ చేయడం జరుగుతుందన్నారు. ముఖ్యంగా రొమ్ము, నోటి, గర్భాశయ ముఖద్వార క్యాన్సర్లను సంబంధించి పరీక్షలు నిర్వహించి, బాధితులను చికిత్స కోసం ఆసుపత్రులకు తరలిస్తారన్నారు. దీని ద్వారా రానున్న ఐదేళ్లలో క్యాన్సర్‌ను నియంత్రణలోకి తీసుకురావచ్చని, దీనికి ప్రజలందరూ సహకరించాలన్నారు. కార్యక్రమంలో మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ సౌభాగ్యలక్ష్మి, మెడికో సోషల్ వర్క్ ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

స్వర్ణాంధ్ర సంస్థ సేవలు అభినందనీయం

రాజమహేంద్రవరం సిటీ: మహిళలకు ఉపాధి శిక్షణ ఇవ్వడానికి 26 ఏళ్లుగా కుట్టు శిక్షణ కేంద్రాన్ని నిర్వహిస్తున్న స్వర్ణాంధ్ర సేవలు అభినందనీయమని జీవిత బీమా సంస్థ రాజమహేంద్రవరం డివిజన్ సీనియర్ డివిజనల్ మేనేజర్ సంధ్యారాణి అన్నారు. లాలాచెరువులోని స్వర్ణాంధ్ర వృద్ధాశ్రమ ప్రాంగణంలో శనివారం జరిగిన కుట్టు మెషీన్ల పంపిణీ కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. స్వర్ణాంధ్ర సంస్థ చేస్తున్న సేవా కార్యక్రమాలను పరిశీలించి, అభినందించారు. ఆమె మాట్లాడుతూ మహిళలు స్వయం సమృద్ధి సాధిస్తేనే సమాజం మరింత అభివృద్ధి చెందుతుందన్నారు. మహిళలకు కుట్టు, మగ్గం, బ్యూటీషియన్, కంప్యూటర్ తదితర వాటిలోశిక్షణ అందిస్తూ, వారి జీవనోపాధి కోసం కుట్టుమెషీన్లను ఉచితంగా అందించడం అభినందనీయమన్నారు. స్వర్ణాంధ్ర నిర్వాహకుడు గుబ్బల రాంబాబు మాట్లాడుతూ ఇప్పటి వరకూ సుమారు 20 వేల మందికి పైగా శిక్షణ అందించామని, సుమారు 750 మందికి కుట్టు మెషీన్లు పంపిణీ చేసినట్టు తెలిపారు. ఈ సందర్భంగా ఐదుగురు మహిళలకు సంధ్యారాణి చేతుల మీదుగా కుట్టుమెషీన్లు అందించారు. కార్యక్రమంలో జీవిత బీమా సంస్థ సేల్స్ మేనేజర్ బి.శ్రీనివాస్ దివ్యగౌరీ గంగాధర్, స్వర్ణాంధ్ర సిబ్బంది శ్రీనివాస్ ఇలియాస్ పాల్గొన్నారు.

సున్నంబట్టీ లేఅవుట్ రోడ్డులో వీధిలైట్ల ఏర్పాటు



విద్యుత్ లైన్ ఏర్పాటు పనులను పరిశీలిస్తున్న కొండబాబు తదితరులు

రాజమహేంద్రవరం సిటీ: సున్నంబట్టీ లే అవుట్ క్వారీ రోడ్డులో రాత్రి సమయంలో జరుగుతున్న ప్రమాదాలను నివారించాలని, క్వారీ గోతుల్లో పడి పలువురు మృతి చెందుతున్న ఘటనలపై చేసిన పోరాటం ఫలితాన్ని ఇచ్చిందని గౌతమీ జీవకారుణ్య సంఘం చైర్మన్, నగరపాలక సంస్థ స్టాండింగ్ కమిటీ మాజీ చైర్మన్ బర్రే కొండబాబు అన్నారు. సున్నంబట్టి లే అవుట్ రోడ్డులో ప్రమాదాలపై నగరపాలక సంస్థ కమిషనర్ దినేష్ కుమార్‌కు విజ్ఞప్తి చేయగా రూ.7 లక్షలు మంజూరు చేసి వీధి లైట్లను ఏర్పాటు చేసే చర్యలు చేపట్టారన్నారు. ప్రజల ప్రాణాలను హరిస్తున్న సంఘటనలపై, క్వారీ గోతులు పూడ్చాలని, రోడ్డు వేయాలని, వీధి లైట్లు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ ఆందోళనలు నిర్వహించడంతో పాటు ఒక రోజు నిరాహార దీక్ష చేపట్టానన్నారు. దీనిపై స్పందించిన కమిషనర్ దినేష్ కుమార్ మూడు అడుగుల రోడ్డును తాత్కాలికంగా 15 అడుగుల రోడ్డుగా విస్తరించారన్నారు. అలాగే వీధిలైట్లు వేసేందుకు రూ.7 లక్షలు మంజూరు చేసి, యుద్ధప్రాతిపదికన స్తంభాలు, లైన్లు వేసి వీధిలైట్లు బిగిస్తున్నారన్నారు. ఈ సందర్భంగా ఎంపీ మార్గాని భరత్ రామ్, కమిషనర్ దినేష్ కుమార్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ ప్రాంతంలో వంద అడుగుల మాస్టర్ ప్లాన్ రోడ్డు వేయాల్సి ఉందన్నారు. ఈ రోడ్డులో ప్రమాదాలు జరగకుండా ప్రజల ప్రాణాలు కాపాడేందుకు క్వారీ యజమానులు కూడా ముందుకు వచ్చి ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని, గోతులను పూడ్చాలని కొండబాబు కోరారు. కార్యక్రమంలో సున్నంబట్టి లేఅవుట్ కమిటీ(రాజరాజేశ్వరీ లేఅవుట్) అధ్యక్షుడు కేవీవీ సత్యనారాయణ, ఉపాధ్యక్షుడు లక్ష్మీనారాయణ, కార్యదర్శి టి.బాబూరావు, డి.ప్రకాశం పాల్గొన్నారు.

కౌంటింగ్ విధులకు పూర్తి స్థాయిలో సన్నద్ధం

రాజమహేంద్రవరం సిటీ: నన్నయ యూనివర్సిటీలో జూన్ 4వ తేదీన జరిగే సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపునకు సిబ్బంది పూర్తిస్థాయిలో సన్నద్ధం కావాలని రిటర్నింగ్ అధికారి, నగరపాలక సంస్థ కమిషనర్ కె.దినేష్ కుమార్ ఆదేశాలు జారీ చేశారు. కౌంటింగ్ సమయంలో నిర్వర్తించాల్సిన విధులపై సిబ్బందికి దిశానిర్దేశం చేశారు. ఈ మేరకు శనివారం కార్పొరేషన్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఆ రోజు ఉదయం 5 గంటలకు కార్పొరేషన్ కార్యాలయం నుంచి నన్నయ వర్సిటీకి బస్సులలో సిబ్బందిని తీసుకువెళతామన్నారు. కౌంటింగ్ హాలుకు మొబైల్ ఫోన్లు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలను తీసుకు వెళ్లకూడదన్నారు. ముందుగా పోస్టల్ బ్యాలెట్ లెక్కింపు జరుగుతుందన్నారు. అలాగే సర్వీసు ఓటర్లకు సంబంధించిన ఎలక్ట్రానిక్ ట్రాన్స్‌మిటెడ్ పోస్టల్ బ్యాలెట్ సిస్టమ్ (ఈటీపీబీఎస్) ఓట్ల లెక్కింపు పర్యవేక్షణకు ఒక అధికారిని నియమించడం జరిగిందన్నారు. సమావేశంలో అదనపు కమిషనర్ పీఎం సత్యవేణి, సూపరింటెండెంట్ ఇంజినీర్ జి.పాండురంగారావు, అర్బన్ తహసీల్దార్ కె.అంజనేయులు, డిప్యూటీ కమిషనర్ ఎస్‌వీ రమణ, ఎంహెచ్‌ఓ డాక్టర్ ఎ.వినూత్న పాల్గొన్నారు.